

# నిండు కుండబొమ్మ

ఇది ఏనాటి మాట?

క్రీస్తుశకం ఒకటి రెండు శతాబ్దుల కాలంనాటి ముచ్చట!

ఊరికి దూరాన.

దానయ్య తన గుడిసెలో చెప్పులు కుట్టుకుంటున్నాడు. అప్పుడే వస్తున్న సూర్యుడు దానయ్య గుడిసెలోకి కూడా వచ్చాడు. సూరీడుకి తన వాళ్ళని, పరాయివాళ్ళని లేదు గదా! రాజభవనంలో మహారాణి ముక్కుపుడకలోని వజ్రం మీద వాలి మెరిసినట్టే దానయ్య చీకటిగదిలోకి కూడా దూరి తళతళ మెరుస్తున్నాడు. నీరెండ గుడిసెనిండా పాకుతుంటే దానయ్యకి గొప్ప సుఖంగా ఉంటుంది. అతనికి లేత సూర్యకిరణాలు ఎంత ఇష్టమో తన ఐదేళ్ళ కూతురు

పాప అంటే అంత ఇష్టం.

పాప పుట్టగానే తల్లి వెళ్లిపోయింది. అప్పటినుంచి పాపకోసమే బతుకుతున్నాడు దానయ్య.

గుడిసె అవతల ఎక్కడో పాప నవ్వు తెరలు తెరలుగా నవ్వు గుత్తులు గుత్తులుగా నవ్వు. చెట్టుమీది పువ్వులు జలజల రాలినట్టు నవ్వు. దానయ్య ఓతల్లీ! అనుకుంటూ లేచి వెళ్ళి పాపను ఎత్తుకుని తీసుకొచ్చి వొళ్ళో కూర్చోపెట్టుకుని మళ్ళీ చెప్పులు కుట్టుకుంటున్నాడు. చొక్కా లేకుండా తండ్రివొళ్ళో కూర్చున్న పాప ఏవో వూసులు చెప్తోంది. అచ్చనకాయలు ఎట్లా ఆడాలో చెప్తోంది. వొచ్చిన వొంట్లన్నీ అప్పగిస్తోంది. దానయ్య మాటిమాటికి ముద్దుపెట్టుకొంటూ పొంగిపోతూ వింటున్నాడు. ఉండుండి పాప అయ్యా నా కాలిగజ్జెల పట్టీ ఒకటి పోయింది. అంటూ బుంగమూతి పెట్టింది.

"అయ్యయ్యో! ఎట్లా పోయిందమ్మా? ఇంకోటి కొందాంలే" అన్నాడు దానయ్య.

"ఇప్పుడే .... ఇవ్వాళే" అంది పాప.

"ఇవ్వాళే! బజార్లో చెప్పులిచ్చొచ్చి వస్తూ వస్తూ తెస్తాగా" అన్నాడు దానయ్య.

పాప పొంగిపోయి తండ్రి వొళ్లొంచి చెంగున దూకి ఎగిరి గంతేసింది. కూతురు సంబరం చూసి కళ్ళు నీళ్ళయిపోయాడు దానయ్య.

"అమ్మా! నేను వూళ్ళోకెళ్ళొస్తాను. సాంబడు బాననిండా నీళ్ళు నింపాడుగా. తానమాడు. కొత్త గజ్జెలపట్టీ తెస్తా" అంటూ బయటికెళ్ళాడు దానయ్య.

పాపకి ఒకటే సంబరం. ఒక కాలునున్న గజ్జలపట్టీ విప్పి పైకెగరేస్తూ చేతుల్తో పట్టుకుంటూ గుడిసంతా తిరుగుతోంది. ఆ ఆటలో ఒకటీ రెండూ మూడూ అంటూ అంకెలు లెక్కపెడుతోంది. గజ్జెలపట్టీని పైపైకి, పైపైకి ఎగరేస్తుంటే ఒక్కోసారి పట్టుకోలేకపోతోంది. ఒకసారి మరీ పైకి దూరంగా విసిరింది. ఆ పట్టీ నాలుగడుగులు ఎత్తునున్న నీళ్ళబానలో పడింది. బానేమో ఎత్తు. పట్టీ నీళ్ళ అడుగునుంది. అందుకోటానికి పీటవేసుకుని బానలోకి వంగింది. పాప

తలకిందులైంది.

దానయ్య గజ్జలపట్టీ కొనుక్కుని పాపా! పాపా! అంటూ గుడిసెలో కొచ్చాడు. పాప పిలుపందుకోలేదు. నవ్వు విన్పడలేదు. దొడ్లోకొచ్చి చూస్తే నీళ్ళబానలో తలకిందులైన పాప! వణుకుతున్న చేతుల్తో పాపని తీశాడు. పాప చేతిలో గజ్జెలపట్టీ, దానయ్య చేతిలో గజ్జెలపట్టీ. గజ్జెలపట్టీలు మిగిల్చి పాప వెళ్ళిపోయింది. దానయ్య గుండె బాదుకున్నాడు. తల నేలకొట్టుకున్నాడు. నలుగురూ చేరారు. ఓదార్చారు. ముద్దాడిన తన చేతుల్తోనే పాపని తీసికెళ్ళి మట్టిలో కప్పివచ్చాడు దానయ్య.

గుడిసెనిండా చీకటి దీపం వెలిగించలేదు. అంతటా పాప నవ్వు విన్పిస్తూంది. రాత్రంతా గడిచాక పొద్దున్నే పాప నవ్వుకోసం సూర్యకిరణాలు సరసర పరుగెత్తుకొచ్చాయి. పాప నవ్వుతోంది. కిరణాలు నవ్వుతున్నాయి.

సాంబడు నీళ్ళు పోయడానికివస్తే "పోయరా! ఆ బాననిండా నీళ్ళుపొయ్యి" అన్నాడు దానయ్య.

ఆ నిండు నీళ్ళకుండకి పసుపురాసి, బొట్టుపెట్టాడు దానయ్య బానముందు సాగిలపడ్డాడు. పాప నవ్వుతోంది. గుత్తులు గుత్తులుగా గుండె కదిలించేటట్లు నవ్వుతోంది. కాలిగజ్జెల పట్టీలు ఘల్లుఘల్లుమని మోగేట్లు నవ్వుతోంది. గబగబా వచ్చి తను చెప్పులు కుట్టే సామాను ముందు కూర్చున్నాడు. వాకిట్లో ఎవరో ఐదేళ్ళ పిల్ల తండ్రితో వెళ్ళటం కనిపించింది. ఆ పిల్లకి చెప్పులు లేవు. గబ గబ లేచివచ్చాడు దానయ్య ఆ పిల్లపాదం ఆది తీసుకున్నాడు. మళ్ళీ వెంటనే లోపలికి వెళ్ళి ఆపిల్లకి చెప్పులు కుట్టడం మొదలెట్టాడు.

ఉన్నట్టుండి బజారుకు వచ్చేవాడు దానయ్య చెప్పులులేని చిన్నపిల్లలు కన్పించటం ఆలస్యం ఆది తీసుకుని సాయంత్రానికి వాళ్ళింటికెళ్ళి చెప్పులిచ్చి వాళ్ళు అవి తొడుక్కుని సంబరపడుతుంటే నా పాప నవ్వుతోంది .......... నవ్వుతోంది అని మురిసిపోయేవాడు. రోజూ నీళ్ళబానకి బొట్టుపెట్టి

సాగిలపడుతున్నా పాపలేని వెలితి తీరటంలేదు. ఎవరో చెప్పారు 'స్థూపం దగ్గరకెళ్ళి సాయంత్రంపూట నువ్వు కూడా దీపం వెలిగించుకో' అని.

సాయంత్రం దీపాల దిన్నె దగ్గర దివ్వె వెలిగించాడు. దీపం అటూ ఇటూ వూగుతుంటే పాప కదులుతున్నట్టుంది. దీపం పాపలా పలకరిస్తోంది. పాపలా నవ్వుతోంది. అక్కడున్న బుద్ధుడి బొమ్మ చూశాడు. ఆయన పాపలాగే నవ్వుతున్నాడు. పాపలాంటి తన కళ్ళతో భక్తుల్ని పలకరిస్తున్నాడు. గుండె చల్లబడ్డట్టయింది దానయ్యకి. వచ్చినవాళ్ళంతా తలా ఒక పాలరాతి శిల్పం చెక్కించి స్తూపానికి వారి పేర ఇస్తున్నారు. తనూ ఒక బొమ్మ కానుకగా ఇద్దామనుకున్నాడు దానయ్య.

కొంత కాలానికి కూడబెట్టిన డబ్బులు తీసుకుని ఓ శిల్పి దగ్గరకెళ్ళి "బుద్ధుడి గుడికి నేనూ ఓ బొమ్మ నిచ్చుకుంటానయ్యా. ఈ డబ్బు తీసుకు చెక్కిపెట్టండయ్యా" అన్నాడు.

"ఏ బొమ్మ చెక్కమంటావ్?" అన్నాడు శిల్పి.

"నీళ్ళకుండ బొమ్మ చెక్కండయ్యా" అన్నాడు దానయ్య.

శిల్పి ఆశ్చర్యపోయాడు. అందరూ యక్షిణి, అప్సరసలు, గజమాలలు చెక్కమని కోరుతుంటే ఇతను కుండ బొమ్మ చెక్కమంటాడేవిటి" అనుకుని "సరే అలాగే" అన్నాడు.

పూర్ణకుంభ శిల్పాన్ని పాలరాతిమీద చెక్కి ఇచ్చాడు శిల్పి. దానయ్య ఆ శిల్పాన్ని భక్తితో మోసుకెళ్ళి స్థూపం మీద పెట్టి సాగిలపడి "అయ్యా! ఈ బొమ్మగుండా నా పాపని నీ కిస్తున్నానయ్యా! నీదే భారం!" అన్నాడు. తర్వాత ఆ పూర్ణ కుంభానికి, 'సంపూర్ణ మానవత్వమని.' 'ప్రేమకలశ' మని .... ఇలా ఎన్నో అర్థాలు!

(ఇటీవలి అమరావతి తవ్వకాల్లో బయటపడ్డ దాన శాసనాలద్వారా ఓ చర్మకారుడు పూర్ణకుంభ శిల్పాన్ని కానుకగా ఇచ్చినట్టు తెలుస్తోంది.)*